గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక బోర్డు

- సెప్టెంబర్ 17లోగా సమస్యల పరిష్కారం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గల్ఫ్ ఏజెంట్లకు చట్టబద్ధత ఉండేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారి ద్వారా మాత్రమే కార్మికులు విదేశాలకు వెళ్లాలని, వారం రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చేలా వ్యవస్థ ఉండాలన్నారు. గల్ఫ్ కార్మిక సంఘాల నేతలతో హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నేతలు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సిఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో 15 లక్షల కుటుంబాలు గల్ఫ్ ఉపాధిపై ఆధారపడి ఉన్నాయన్నారు. వారిని ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ గల్ఫ్, ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు పెట్టాలని నిర్ణయించామన్నారు.

"గల్ఫ్ కార్మికుల సహాయార్థం ప్రజాభవన్‌లో ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేస్తాం. సీనియర్ ఐఎఎస్ నేతృత్వంలో ప్రత్యేక వ్యవస్థను తీసుకొస్తాం. ఉపాధి కోసం వెళ్లిన వారి వేతనాలు, బాగోగులూ చూసుకోవాలి. కొన్ని దేశాలు, రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాలపై అధ్యయనం చేస్తున్నాం. ఓవర్సీస్ కార్మికుల కోసం పిలిప్పీన్స్, కేరళలో మంచి విధానం అమల్లో ఉంది. అన్నీ అధ్యయనం చేసిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం కూడా సమగ్ర విధానం రూపొందిస్తుంది. గల్ఫ్ కార్మికులు చనిపోతే వారి కుటుంబాలకు రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం చేయాలని ఇప్పటికే నిర్ణయించాం. సెప్టెంబర్ 17లోగా సమస్యల పరిష్కారానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. గల్ఫ్ కార్మికులకు న్యాయపరమైన సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటాం. రైతు బీమాలాగే గల్ఫ్ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. నిజామాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్‌ను గెలిపించండి.." అని రేవంత్ రెడ్డి తెలిపారు.

లౌకిక విలువలకు పాతరేస్తున్న బిజెపి

- ఎన్నికల్లో సాగనంపాలి
- ప్రజాస్వామిక హక్కులపై మోడీ ఉక్కుపాదం
- ప్రశ్నించే గొంతులను నొక్కుతున్న కాషాయ దళం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్

సమావేశంలో మాట్లాడుతున్న టి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగ హక్కులను హరిస్తూ... లౌకిక విలువలకు పాతరేస్తున్న బిజెపి మళ్లీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ అన్నారు. బిజెపిని ఓడించాలని కోరుతూ. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సాయికృష్ణ ఫంక్షన్‌హాల్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పద్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలను నొక్కుతూ.. అప్రజాస్వామికంగా పరిపాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో సాగనంపాలన్నారు. మను ధర్మశాస్త్రాన్ని అమలు చేసేందుకు రాజ్యాంగాన్ని మార్చడానికి కూడా బిజెపి వెనుకాడబోదని చెప్పారు. ఈ దేశంలో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా.. ప్రజల దృష్టిని రామ మందిరం వైపు మళ్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వామపక్ష ఉద్యమాల వల్ల వచ్చిన ఉపాధి హామీ చట్టానికి నిధుల్లో కోతలు పెట్టి నిర్వీర్యం చేస్తున్నారని చెప్పారు.

సాగు పెట్టుబడికి 50 శాతం అదనంగా ఉండేలా పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్న స్వామినాథన్ కమిషన్ సిఫారసులను తుంగలో తొక్కుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధనాల వల్ల దేశంలో ప్రతి రోజూ ఎంతో మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ నిత్యం బేటీ పడావో బేటీ బచావో అన్న నినాదం చేస్తున్నారు కానీ, మహిళలపై లైంగికదాడులు, హత్యలు చేసిన దుండగులను జైలు నుంచి బయటకు ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. ప్రశ్నిస్తున్న ప్రజా మేధావులు వరవరరావు, సాయిబాబు లాంటి వారిని జైలులో పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడానికి.. కార్పొరేటు శక్తులకు అప్పగించడానికే యూనివర్సిటీలను ప్రయివేటు పరం చేస్తున్నారని విమర్శించారు. మతతత్వ విధానాలను పాఠ్యాంశాల్లో చేర్చి.. లౌకికవాదానికి చిచ్చు పెడుతున్నారన్నారు. అదేవిధంగా, రాష్ట్రంలో గడువులోగా కాంగ్రెస్ హామీలను నెరవేర్చకపోతే ఎర్రజెండా ఉద్యమాలకు సిద్ధంగా ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ రాములు, కార్యదర్శివర్గ సభ్యులు కిల్లె గోపాల్, చంద్రకాంత్, కురుమయ్య, కడియాల మోహన్, మాణిక్యరాజు, నాయకులు రాజ్‌కుమార్, లక్ష్మయ్య, నర్సింహ, వేణుగోపాల్, ప్రశాంత్, భరత్, జగన్ సత్యం, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ టాపర్స్‌కు సిఎం అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిపిఎస్సి) 2023 ఫలితాల్లో మెరిసిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సిఎం కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఈసారి 50 మందికిపైగా సివిల్ సర్వీసెస్‌కు ఎంపికవడం పట్ల సిఎం ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు సాధించిన పాలమూరుకు చెందిన దోనూరి అనన్య రెడ్డికి సిఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు

చిట్యాల రాజుకు ఒయు డాక్టరేట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లా వాసి చిట్యాల రాజుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఒయు) ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో డాక్టరేట్ పట్టా వరించింది. డాక్టర్ ఎవి కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ నెట్‌వర్క్‌కు అనుసంధానమయ్యే వివిధ రకాల స్మార్ట్ డివైజెస్‌ల అథెంటికేషన్, డాటా సెక్యూరిటీ విషయంలో ఎదురయ్యే సవాళ్లను మెషిన్ లెర్నింగ్ సహాయంతో ఎలా అధిగమించొచ్చు'అనే విషయంపై ఆయన పరిశోధన చేశారు. ప్రతిష్టాత్మకమైన ఓయూ డాక్టరేట్‌ను మంగళవారం రాజుకు ప్రదానం చేశారు. ఇదే అంశంపై ఆయన రచనలు, వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్లలో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జె లక్ష్మణ్‌నాయక్‌తోపాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఎల్పీసెట్ ఫీజు చెల్లింపు గడువు 26 వరకు పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాలకు నిర్వహించే పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎల్పీసెట్) ఫీజు చెల్లింపు గడువును ఈనెల 26వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌బిటీఈటీ) కార్యదర్శి పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటిఐ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్/ ఎల్‌పిసెట్ ఇన్‌చార్జిని సంప్రదించాలని కోరారు.

మోనికాకు సివిల్స్‌లో 487వ ర్యాంకు

- ఎస్‌ఆర్ శంకరన్ ఐఎఎస్ అకాడమి అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్సి) ఫలితాల్లో మోనికా అడుసుమిల్లి జాతీయస్థాయిలో 487 ర్యాంకు సాధించారు. ఈ మేరకు ఎస్‌ఆర్ శంకరన్ ఐఎఎస్ అకాడమి చైర్మెన్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, అడ్వైజర్, చీఫ్ గార్డెనర్ వై సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కె సురేందర్‌రెడ్డి, కోర్సు కోఆర్డినేటర్ జనార్ధన్‌దండు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె సతీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ఆమెకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. తమ అకాడమిలో ఆమె తెలుగు సాహిత్య విద్యార్థినిగా యుపిఎస్సికి సన్నద్ధమయ్యారని పేర్కొన్నారు.

సంకల్ప్‌పత్ర కాదు.. దేశ ప్రజలకు మరణపత్రం

- నిత్యావసర ధరలు, నిరుద్యోగం నియంత్రణకు చర్యల్లేవు
- జమిలి ఎన్నికలతో రాజ్యాంగ ఫెడరల్ వ్యవస్థకు ప్రమాదం : బి వెంకట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సంకల్ప్ పత్ర పేరుతో బిజెపి విడుదల చేసిన మ్యానిఫెస్టో దేశ ప్రజలకు మరణ పత్రంగా మారే ప్రమాదముందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. మోడీ గ్యారెంటీ అంటూ ప్రగల్భాలు పలుకుతూ బిజెపి నేతలు విడుదల చేసిన మ్యానిఫెస్టోలో పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, నిరుద్యోగ నియంత్రణకు చర్యలు లేనే లేవన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కల్పన, గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనుల విస్తరణ వంటి అంశాల ఊసే లేదని విమర్శించారు. ఎన్ఆర్సీ, సిఎఎ వంటి చట్టాల అమలు, జమిలీ ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొనడంతో రాజ్యాంగ మనుగడకు, ఫెడరల్ వ్యవస్థకు ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. రాజ్యాంగం అమల్లో లేకుంటే వ్యవసాయ కార్మికులుగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, మహిళా రిజర్వేషన్లు అమలు ప్రమాదంలో పడటం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ రక్షణ కోసం, ప్రజాస్వామ్య హక్కుల కోసం వచ్చే ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను ఓడించాలని, వామపక్ష , లౌకిక ప్రజాతంత్ర శక్తులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఐదు కేజీల ఉచిత బియ్యమే కాదు 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించకుండా, ఎఫ్‌సిఐ గోదాములను నిర్వహించే బాధ్యత తీసుకోకుండా ఏ విధంగా ఐదు కేజీల బియ్యం పేదలకు ఇస్తారని ప్రశ్నించారు. కార్మికులు వ్యవసాయ కార్మికుల కనీస వేతనాల గురించి బిజెపి పత్రంలో ప్రస్తావన లేదన్నారు. కార్పొరేట్ శక్తులకు లాభాలు కలిగించేందుకు కార్పొరేట్ కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని, కార్మిక కోడ్‌లను అమలు చేయడానికి బిజెపి సిద్ధపడిందని విమర్శించారు. వీరి కోసమే బుల్లెట్ ట్రైన్‌లను వేస్తామని ప్రకటించింది తప్ప సాధారణ ప్రజల ప్రయాణం చేసే జనరల్ బోగీలను పెంచుతామని చెప్పకపోవడం శోచనీయమన్నారు. గ్రామీణ పేదలకు, రైతాంగానికి, కార్మిక వర్గానికి వ్యతిరేక మేనిఫెస్టోని విడుదల చేసిన బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్ బొప్పని పద్మలు పాల్గొన్నారు.

టెట్‌కు 2.51 లక్షల దరఖాస్తులు

- ఇప్పటి వరకు 11,095 మంది అప్లికేషన్ల సవరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 2,51,646 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు ఎస్‌సిఇఆర్‌డి డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ పేపర్-1కు 90,789 మంది, పేపర్-2కు 1,60,857 మంది కలిపి 2,51,646 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. మంగళవారం ఒక్క రోజే పేపర్-1కు 487 మంది, పేపర్-2కు 1,398 మంది కలిపి మొత్తం 1,885 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. పేపర్-1కు 91,421 మంది, పేపర్-2కు 1,61,302 మంది కలిపి మొత్తం 2,52,723 మంది అభ్యర్థులు ఫీజు చెల్లించారని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఈనెల 20వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 11,095 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సవరణ చేసుకున్నారని వివరించారు. ఇందులో పేపర్-1కు 4,123 మంది, పేపర్-2కు 6,972 మంది ఉన్నారని తెలిపారు. దరఖాస్తుల సవరణకు ఈనెల 20వ తేదీ వరకు అవకాశముందని పేర్కొన్నారు. వచ్చేనెల 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) విధానంలో నిర్వహిస్తారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.inవెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

కాంగ్రెస్ గూటికి బిఆర్ఎస్, బిజెపి నేతలు

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్‌కు చెందిన పలువురు సీనియర్ నేతలు సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో వారు కాంగ్రెస్ గూటికి చేరారు. రేవంత్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిఆర్ఎస్ నేత, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల్ చారి, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావుతోపాటు సరూర్‌నగర్ మాజీ కార్పొరేటర్ అనిత, దయాకర్‌రెడ్డి దంపతులు కూడా పార్టీలో చేరారు. అంతకు ముందు కొంత మంది బిజెపి నేతలు గాంధీభవన్‌లో టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ చేరారు. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జీ జెఎన్ వెంకట్, మాజీ జడ్‌పిటిసి జెఎన్ సునీత, ఇబ్రహీంపట్నం బిజెపి నేత ఆకుల లింగారెడ్డి, మెట్‌పల్లి బిజెపి నేత చెన్నమనేని శ్రీనివాసరావు, ఎంపీపీ నెరేళ్ల దేవేందర్, మాజీ జడ్‌పిటిసి కొక్కు పురుషోత్తం, బీఆర్ఎస్ సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు కూడా పెద్ద సంఖ్యలో హస్తం చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపి రంజిత్‌రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎడ్మ బొజ్జు, పార్టీ నాయకుల ఈరవర్తి అనిల్, పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సివిల్స్‌లో సత్తా చాటిన.. ఉమ్మడి వరంగల్ యువత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సివిల్స్ ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురు యువకులు విజేతలుగా నిలిచారు. గతేడాది ఐపిఎస్ సాధించిన జయసింహారెడ్డి ఈసారి 103వ ర్యాంకు సాధించడంతో ఈసారి ఐఎఎస్ సాధించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఎట్టకేలకు తన లక్ష్యాన్ని సాధించడంతో ఆ కుటుంబంలో హర్షం వ్యక్తమవుతుంది. వరంగల్ పరిశోధనా స్థానంలో ప్రముఖ శాస్త్రవేత్త ఉమారెడ్డి కుమారుడే జయసింహారెడ్డి. రఘునాథపల్లి మండలకేంద్రానికి చెందిన కొయ్యాడ ప్రణయ్ 554వ ర్యాంకు సాధించారు. ప్రణయ్ ఎలాంటి కోచింగ్ లేకుండానే ఈ ర్యాంకు సాధించడం గమనార్హం. గతేడాది 885వ ర్యాంకు సాధించిన ప్రణయ్ ఐఆర్ఎంఎస్ రావడంతో ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు. గీసుకొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన సయింపు కిరణ్ 568వ ర్యాంకు సాధించారు. వరంగల్ శివనగర్‌కు చెందిన కోట అనిల్‌కుమార్‌కు 764 ర్యాంకు సాధించారు. కిరణ్‌కు ఐపిఎస్ వచ్చే అవకాశముండగా, కోట అనిల్‌కుమార్‌కు ఐఆర్ఎస్ వచ్చే అవకాశమున్నట్లు అంచనా వేస్తున్నారు.

నిరాశపడకుండా సాధించిన సయింపు కిరణ్

568వ ర్యాంకు సాధించిన సయింపు కిరణ్.. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వరంగల్ మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో పాఠశాల విద్యనభ్యసించిన కిరణ్.. ఇంటర్ ప్రయివేటు కాలేజీలో చదివారు. జెఇఇ అడ్వాన్స్‌లో 1598వ ర్యాంకు సాధించి ఐఐటి ఢిల్లీలో బీటెక్ పూర్తి చేశారు. 2018లో మొదటిసారి సివిల్స్ రాశారు. ప్రిలిమ్స్‌లో క్వాలిఫై కాలేదు. జీవితంలో మొదటిసారి ఫెయిల్యూర్ వచ్చిన కుంగిపోకుండా తప్పులను సరిదిద్దుకొని 2019, 2020లో ప్రిలిమ్స్ పూర్తి చేసి మెయిన్స్ రాశారు. రెండు మార్కులతో సెకండ్ అటెంప్ట్‌లో ఇంటర్వ్యూ పోయింది. 2021లో ఇంటర్వ్యూకు అవకాశం వచ్చింది. జాతీయస్థాయిలో నిర్వహించే సిపిఎఫ్‌లో ఆలిండియాలో 15వ ర్యాంకు సాధించిన సయింపు కిరణ్ ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు.

మా ఇద్దరినీ హత్య చేస్తారనిపిస్తోంది..

- అక్బరుద్దీన్ ఒవైసి సంచలన వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను, తన సోదరుడు అసదుద్దీన్ ఓవైసీని చంపాలని కొందరు చూస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ పాతబస్తీ యాకుత్‌పురలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఎంఐఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో తాము చాలా బలంగా ఉన్నామని, అందుకే తమను ఓడించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఎవరు ఎంత ప్రయత్నించినా తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అయితే, తమను (ఒవైసి సోదరులను) జైలుకు పంపి అక్కడ మెడిసిన్ పేరుతో స్లోపాయిజ్ ఇచ్చి చంపేస్తారేమోనని అనిపిస్తోందన్నారు. లేదా గన్‌తో కాల్చి హత్య చేస్తారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ఎలాంటి పరిస్థితి వస్తుందో, మరణం ఎటు వైపు నుంచి పొంచి ఉందో తెలియదని చెప్పారు. అయినా, తాము భయపడబోమన్నారు. మరోసారి హైదరాబాద్ గడ్డపై మజ్లిస్ జెండా ఎగుర వేస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల వేళ అక్బరుద్దీన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.

కార్పొరేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

- నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు చేపట్టడం తగదు
- తరగతులు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరించాలి
- ఇంటర్ బోర్డు కార్యదర్శికి ఎస్ఎఫ్ఐ వినతి

ఇంటర్ బోర్డు కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు చేపట్టడం తగదనీ, కార్పొరేట్ కాలేజీలు, అకాడమిలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కోచింగ్‌ల పేరుతో లక్షలాది రూపాయలు దండుకుంటూ ఇంటర్మీడియట్ తరగతులు నడుపుతున్నాయని విమర్శించింది. అలాంటి కార్పొరేట్ కాలేజీలు, అకాడమిలపై కఠినంగా వ్యవహరించాలని కోరింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాను మంగళవారం హైదరాబాద్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల ఫలితాలు రాకుండానే పిఆర్‌వోలు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను పెట్టి కార్పొరేట్ విద్యాసంస్థలు, అకాడమిలు ముందస్తు ప్రవేశాలు చేపడుతున్నాయని వారు తెలిపారు. ఇంటర్ పరీక్షలు పూర్తయిన వెంటనే విద్యార్థులకు తరగతులు నడుపుతున్నాయని పేర్కొన్నారు. నీట్, జెఇఇ, ఎప్‌సెట్ కోచింగ్ పేరుతో లక్షలాది రూపాయలు తీసుకుంటున్నాయని వివరించారు. బోర్డులు లేకుండా, అపార్ట్‌మెంట్లను అద్దెకు తీసుకుని నిర్బంధంగా తరగతులు నడుపుతున్నాయని తెలిపారు. ఇంటర్ బోర్డు అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రహస్యంగా తరగతులు నడుపుతున్న కార్పొరేట్ కాలేజీలు, అకాడమిలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నారాయణ, శ్రీచైతన్య, రెసోనెన్స్, అవినాష్, ఫిడ్జీ, ఆకాశ్ వంటి అకాడమిలు ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, సోషల్ మీడియాతోపాటు వారి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను విద్యార్థుల పాఠశాలలు, ఇండ్ల వద్దకు తిప్పుతూ రూ.లక్షలు ఫీజులు తీసుకుంటున్నాయని విమర్శించారు. ఇంటర్ బోర్డు అధికారులు కనీసం పరిశీలించడం లేదని, ఏమీ పట్టించుకోకుండా కేవలం షోకాజ్ నోటీసులు మాత్రమే ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి స్పందించారనీ, స్క్వాడ్ టీమ్‌లను ఏర్పాటు చేసి కాలేజీలకు పంపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం మమత, రాష్ట్ర కమిటీ సభ్యులు జూనుగరి రమేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా, కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

యుపిఎస్‌సి ఫలితాల్లో విజయానికి కేరాఫ్ అడ్రస్ నారాయణ

- జాతీయ స్థాయిలో 3, 493, 545, 919 ర్యాంకులతో సంచలనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్సి) ఫలితాల్లో విజయానికి కేరాఫ్ అడ్రస్‌గా నారాయణ విద్యాసంస్థ నిలిచింది. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన సివిల్ సర్వీసెస్‌లో నారాయణ విద్యార్థులు సంచలన విజయం సాధించారు. ఈ మేరకు నారాయణ విద్యాసంస్థల గ్రూప్ డైరెక్టర్లు పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యుపిఎస్సి ఫలితాల్లో జాతీయ స్థాయిలో దోనూరు అనన్యరెడ్డి మూడో ర్యాంకు, దొనక పృథ్వీరాజ్ కుమార్ 493 ర్యాంకు, సిహెచ్ నరేంద్ర పడాల్ 545 ర్యాంకు, ధరావత్ సాయిప్రకాశ్ 919 ర్యాంకు సాధించి విజయభేరి మోగించారని వివరించారు. సివిల్స్ కష్టతరమంటూ నేటి యువత భావిస్తున్నదని తెలిపారు. ఇష్టపడి చదివితే కచ్చితంగా విజయం సాధించొచ్చని సూచించారు. పట్టుదల, నిరంతర కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని పేర్కొన్నారు. సమకాలీన అంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉంటే సివిల్స్ సాధించడం కష్టమేమీ కాదని వివరించారు. 21ఏళ్లకే ఐఎఎస్ కలను నెరవేర్చేందుకు నారాయణ ఇంటిగ్రేటెడ్ ఐఎఎస్ అకాడమిని తీర్చిదిద్దామని సాక్ష్యమే ఈ ఫలితాలని పేర్కొన్నారు. సివిల్స్‌లో ర్యాంకులు పొందిన అనన్యరెడ్డి, పృథ్వీరాజ్‌కుమార్, సిహెచ్ నరేంద్ర పడాల్ ఇంటిగ్రేటెడ్ అకాడమిలో శిక్షణ పొందారని వివరించారు. ర్యాంకులు పొందిన వారిని అభినందించారు.

మహాదేవపూర్ పోలీస్‌స్టేషన్ ఖాళీ

- ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌తోపాటు 9 మంది బదిలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందిపై పోలీస్‌శాఖ చర్యలకు ఉపక్రమించింది. సోమవారం మహాదేవపూర్ పోలీస్ సిబ్బంది ఏడుగురిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు మహాదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో జడ్‌పిటిసి భర్త శ్రీనివాస్ చేసిన డ్యాన్స్ వైరల్‌గా మారడంతో జిల్లా ఎస్‌పి స్పందించి ఎస్ఐ ప్రసాద్‌ను విఆర్‌కు అటాచ్ చేసి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు. అదేవిధంగా ఇక్కడ పనిచేస్తున్న కానిస్టేబుళ్లు ఇసుక, గుడుంబా, ఇతర కారణాలతో ఏడుగురు కానిస్టేబుళ్లను ఇతర పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు. దాంతో మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ ఖాళీగా దర్శనమిస్తోంది. మహాదేవపూర్ పోలీస్ స్టేషన్‌కు వివిధ గ్రామాల నుంచి వచ్చే భూ తగాదాలు, కొట్లాటల కేసులు వస్తుంటాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దున ఉన్న పోలీస్‌స్టేషన్ కావడంతో మావోయిస్టుల ప్రభావమూ ఎక్కువగానే ఉండటంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీస్ స్టేషన్‌కు పూర్తిస్థాయిలో పోలీసు బలగాలను నియమించాలని కోరుతున్నారు.

మోడీ వైఫల్యాలను గుర్తించిన ప్రజలు

- భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు బిజెపి యత్నం : ప్రొఫెసర్ నాగేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జీవనోపాధి, ధరల పెరుగుదల తదితర ఆర్థిక రంగంలో మోడీ వైఫల్యాలను ప్రజలు గుర్తించారని ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ తెలిపారు. 'పార్లమెంటు ఎన్నికలు - కార్మికవర్గ కర్తవ్యం' అనే అంశంపై సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో నాగేశ్వర్ ప్రధాన వక్తగా విచ్చేసి ప్రస్తుతం దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, బిజెపి ఎత్తుగడలు, వాటిని తిప్పికొట్టేందుకు అనుసరించాల్సిన ప్రచార వ్యూహం తదితర విషయాలను వివరించారు. ఈ సందర్భంగా విశ్వసనీయత కలిగిన పలు సంస్థలు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ, అధ్యయన ఫలితాలను విశ్లేషించారు. సిఎస్‌డిఎస్ - లోక్‌నీతి, ది హిందూ కలిసి చేసిన సర్వే, కన్జప్షన్ ఎక్స్‌పెండిచర్ సర్వే తదితర సర్వేలను ఆయన వివరించారు. కొత్త నిర్వచనం ప్రకారం..దేశంలో భిక్షగాళ్లు కూడా దారిద్ర్య రేఖకు ఎగువన ఉంటారని తెలిపారు. నిజంగా పేదరికాన్నే తగ్గిస్తే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ సరుకుల అవసరమెందుకు ఏర్పడిందని ఆయన ప్రశ్నించారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినా ప్రజల నుంచి 2022-23 ఒక్క ఏడాదిలో ఏడున్నర లక్షల కోట్ల రూపాయలను ప్రజల నుంచి వసూలు చేశారని తెలిపారు.బిజెపి పుల్వామా, బాలాకోట్ వంటి భావోద్వేగ అంశాలతో గట్టెక్కిందని గుర్తుచేశారు. పుల్వామా ఘటనకు బిజెపి వైఫల్యమే కారణమయినా, దాన్ని తమకు అనుకూలంగా మార్చుకుందని చెప్పారు. మరోసారి పాకిస్తాన్, చైనా అంటూ రెచ్చగొడుతున్నా తగిన స్పందన ప్రజల నుంచి రాకపోవడంతో కచ్చతీవుల అంశాన్ని తెరమీదికి తెచ్చిందని తెలిపారు. తెస్తున్న యునిఫాం సివిల్ కోడ్ తదితర అంశాలపై మాట్లాడేటప్పుడు మరింత స్పష్టంగా ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. ఇలాంటి అంశాలను అడ్డు పెట్టుకుని మిగిలిన పార్టీలు మైనార్టీలకు అనుకూలమనీ, మెజార్టీ హిందువులకు వ్యతిరేకమని చిత్రీకరిస్తున్నాయని హెచ్చరించారు. ఇప్పటికీ దేశంలో 11 శాతం మంది మాత్రమే హిందూ రాజ్యభావనకు అనుకూలంగా ఉండగా, మెజారిటీ ప్రజలు బహుళత్వ భారతదేశాన్నే ఇష్టపడుతున్నారని తెలిపారు. ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాడుతుంటే దానికి రాముడిని మొక్కితే చాలన్నట్టు మోడీ సర్కారు చెబుతున్నదన్నారు. వేతనాలు పెరగాలన్నా, నిరుద్యోగ సమస్య పరిష్కారం కావాలన్నా ఎక్కడికక్కడ పోరాడితే తప్ప మరో మార్గం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, ఎస్.రమ, పి.జయలక్ష్మి, నవతెలంగాణ సంపాదకులు సుధాభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్గాలా రివైవ్' వైద్య పునరావాస కేంద్రం ఏర్పాటు

- ప్రారంభించిన మంత్రి శ్రీధర్

ప్రజాశక్తి - హైదరాబాద్

శస్త్ర చికిత్స ముందు, తరువాత సేవలు, ఫిజియోథెరపీ సేవల కోసం ఏర్పాటు చేసిన 'అర్గాలా రివైవ్' వైద్య పునరావాస కేంద్రాన్ని మంత్రి శ్రీధర్ బాబు లాంచనంగా ప్రారంభించారు. జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ వైద్య కేంద్రం రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఆర్గాలా రివైవ్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డే కేర్ మెడికల్ రిహాబ్ సెంటర్. ఆర్థో, న్యూరో, కార్డియాక్, జెరియాట్రిక్ రిహాబ్‌లలో ప్రపంచ స్థాయి సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నాం. నిర్దిష్ట లక్ష్యాలు, సమయానుకూల ఫలితాలతో కచ్చితంగా రూపొందించబడింది.' అని అర్గాలా హెల్త్ సర్వీసెస్ ఎండి డాక్టర్ శ్రీదేవి యడవల్లి తెలిపారు.

బిఆర్ఎస్ అభ్యర్థులకు 18న బి ఫారాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయనున్న బిఆర్ఎస్ అభ్యర్థులకు పార్టీ అధినేత కెసిఆర్ ఈ నెల 18న బి ఫారమ్‌లను అందజేయనున్నట్టు మంగళవారం ఆ పార్టీ ప్రకటించింది. అదే సందర్భంలో ఎన్నికల ఖర్చుల నిమిత్తం నియమావళిని అనుసరించి రూ.95 లక్షల చెక్కును అభ్యర్థులకు అందించనున్నట్టు తెలిపింది. ఆ రోజు జరిగే సమీక్షా సమావేశంలో ఎన్నికల ప్రచారం, తదితర వ్యూహాలకు సంబంధించి అధినేత సమగ్రంగా చర్చించనున్నట్టు పేర్కొంది. ఈ సమావేశంలో... ఎంపి అభ్యర్థులతో పాటు పార్టీ శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, జడ్‌పి చైర్మన్లు, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు, పార్టీ ముఖ్యులు పాల్గొంటారని తెలిపింది. తెలంగాణ ప్రజలకు మరింత చేరుకావాలని అధినేత కెసిఆర్ నిర్ణయించారని బిఆర్ఎస్ పేర్కొంది. కాంగ్రెస్ తెచ్చిన కరువుకు అల్లాడుతున్న రాష్ట్ర రైతాంగం వద్దకు వెళ్లి వారి కష్ట సుఖాలను తెలుసుకోవడానికీ, వారికి భరోసానివ్వడానికి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు నిర్వహించాలని కెసిఆర్ నిర్ణయించారనీ, రూట్ మ్యాప్‌పై చర్చించి తుది నిర్ణయం ప్రకటిస్తాయని తెలిపింది.

రాజకీయ క్షేత్రంలో 'రాముడు'

- అయోధ్యపై ఆసక్తి.. భద్రాద్రిపై నిర్లక్ష్యం
- భద్రాచలం వైపు కన్నెత్తయినా చూడని మోడీ, షా
- రూ.100 కోట్లు వెచ్చిస్తే ఇక్కడ ఎంతో పురోగతి
- హెరిటేజ్ సిటీ కాదూ.. రైలుమార్గమూ రాదు..
- నేడు సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అయోధ్య రామునిపై ఉన్న భక్తి ప్రపత్తులు.. భద్రాద్రి రామునిపై ప్రధాని మోడీకి ఎందుకు లేవని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు. భద్రాద్రి రాముడిని ఎందుకింత నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారన్న చర్చ నడుస్తోంది. రాముని పేరుతో రాజకీయం చేసేందుకే బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శకుల మాట. ప్రతి ఎన్నికలకు ముందు రాముని పేరుతో రాజకీయం చేయడం.. తద్వారా లబ్ధి పొందడం బిజెపికి ఆనవాయితీగా మారింది. నిజంగా రామునిపై భక్తి ఉంటే భద్రాచలాన్నీ అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత మోడీ ప్రభుత్వంపై లేదా? అనే సందేహాలను జనం వెలిబుచ్చుతున్నారు. రామాయణ ఇతివృత్తంలోని అనేకం దక్షిణ అయోధ్య భద్రాచలంతో ముడిపడివున్నా ఇక్కడి రాముడు నిర్లక్ష్యానికి గురవడం వెనుక రాజకీయం తప్ప మరో కారణం లేదనే అభిప్రాయం పలువురిలో ఉంది. అయోధ్య ఉన్న ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్‌సభ స్థానాలు ఉండటంతోనే అయోధ్య రాముని పేరుతో రాజకీయం చేస్తున్నారనే విమర్శ బిజెపిపై ఉంది.

అయోధ్యకు తీసిపోని భద్రాద్రి ప్రాశస్త్యం

బుధవారం శ్రీ సీతారాముల కల్యాణానికి భద్రాచలంలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

అయోధ్యకు తీసిపోని రీతిలో భద్రాచలం ప్రాశస్త్యం ఉంది. శ్రీరాముడు సరయు నది ఒడ్డున అయోధ్యనగరంలో పుట్టారు. కానీ రామాయణంలోని ముఖ్యమైన ఘట్టాలు భద్రాచలం పరిసరాలతో ముడిపడివున్నాయి. శ్రీరాముడు దండకారణ్యంలో సీతాలక్ష్మణ సమేతంగా నడియాడారని అంటారు. ఆ దండకారణ్యంలోని పుణ్యక్షేత్రమే భద్రాచలం. దాని పక్కనే దుమ్ముగూడెం మండలంలోని భద్రాచలంలో సీతమ్మ తల్లి ఆశ్రయం పొందిన పర్ణశాల ఉంది. చివరకు సీతమ్మను రావణుడు అపహరించుకుపోయిన ప్రదేశం కూడా ఇదే. రావణునితో వీరోచితంగా పోరాడి జఠాయువు ఆత్మార్పణ గావించిన ఒకప్పటి రెక్కపల్లి ఇప్పటి రేఖపల్లీ ఈ ప్రాంతానికి చెందినదే అని కథలు కథలుగా చెబుతుంటారు. శబరికి శ్రీరామచంద్రుడు వైకుంఠాన్ని ప్రసాదించిన పుణ్యక్షేత్రమూ భద్రాచలమే. ఇంతటి విశిష్టత కలిగిన భద్రాచలానికి కేంద్రప్రభుత్వం నయాపైసా కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

హెరిటేజ్ హోదా లేదు.. రైలూ రాదు..

భద్రాద్రి విషయంలో కేంద్రం నిర్లక్ష్యానికి ఈ రెండు ఉదాహరణలు చాలు. కేంద్ర పట్టణ అభివృద్ధి శాఖ మంత్రిగా వెంకయ్యనాయుడు హయాంలో ప్రాశస్త్యం కలిగిన స్థలాలకు హెరిటేజ్ సిటీ హోదా ఇచ్చారు. కానీ ఎంతో విశిష్టత కలిగిన వారసత్వ ప్రాంతాల జాబితాలో భద్రాచలానికి చోటులేదు. రూ.లక్ష కోట్లతో బుల్లెట్ రైళ్లు, వందేమాతరం ట్రెయిన్లు, దేశంలోని పలు నగరాల నుంచి అయోధ్యకు రైళ్లు ఏర్పాటు చేసిన సర్కారు నిజంగా రామునిపై భక్తి ఉంటే ఇంతకాలంగా రైలుమార్గం ఎందుకు ఏర్పాటు చేయలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భద్రాచలానికి కేవలం ఐదు కి.మీ దూరంలోని పాండురంగాపురం వరకు రైల్వే లైన్ ఉన్నా కనీసం రూ.50 కోట్లు ఖర్చు పెట్టి రైల్వేలైన్ నిర్మించడంలో కేంద్రం నిర్లక్ష్యం ఉందనే విమర్శలున్నాయి.

భద్రాద్రి పరిరక్షణ మరిచి నిర్వీర్యం..!

భద్రాచలం పరిరక్షణ మరిచిన కేంద్ర ప్రభుత్వం చివరకు నిర్వీర్యంలో భాగమవుతోంది. రామాలయం తెలంగాణలో ఉండగా సుమారు వెయ్యి ఎకరాల రామాలయ భూములను పోలవరం ముంపులో లేనప్పటికీ ఐదు పంచాయతీలను ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చారు. గుండాల, పురుషోత్తపట్నం, పిచ్చుకలపాడు, కన్నాయిగూడెం, ఎటపాక పంచాయతీలను ఆర్డినెన్స్ ద్వారా ఎపిలో కలిపారు. రాముడు భద్రాచలం.. రామాలయ భూములు ఆంధ్రాలో ఉండడం వల్ల కనీసం చెత్త డంపింగ్‌కూ స్థలం లేని దుస్థితి. అర్ధచంద్రాకృతిలో రెండుగా ఉన్న భద్రాచలంలో ఓవైపు గోదావరి, మరోవైపు ఆంధ్రప్రదేశ్ భూములున్నాయి. ఫలితంగా భద్రాచలంలో డంపింగ్‌యార్డు సైతం ఏర్పాటు చేసుకోవడానికి స్థలం లేదు. దీనివల్ల భద్రాచలం పట్టాణాభివృద్ధి శాశ్వతంగా భూస్థాపితం అయింది. రామాలయానికి వచ్చే సందర్శకులకు నిలువ నీడలేకుండా చేసింది మోడీ ప్రభుత్వం కాదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థలం లేని కారణంగా కొత్తగూడెం జిల్లా కేంద్రాన్ని భద్రాచలంలో కాకుండా పాల్వంచలో ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నాటి బిఆర్ఎస్ పాలకులది సైతం అదే తీరు...

గత బిఆర్ఎస్ పాలకులు సైతం భద్రాచలం విషయంలో నిర్లక్ష్యాన్నే సాగించారు. హైదరాబాద్ సమీపంలో ఉన్న యాదాద్రి లక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని పునర్నిర్మించినా గత బిఆర్ఎస్ ప్రభుత్వం.. రాముడు కొలువుదీరిన భద్రాచలంపై ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదు. తానీషా ప్రభువు కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాల సమర్పణ విషయంలోనూ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు చిన్నచూపే చూశారు. కేవలం ఒక్కసారి మాత్రమే పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు కెసిఆర్ సమర్పించడం గమనార్హం. రూ.వంద కోట్లు అని ఒకసారి, రూ.వెయ్యి కోట్లు అని మరోసారి హామీ ఇచ్చిన కెసిఆర్ భద్రాచలం అభివృద్ధికి ఒక్క పైసా కేటాయించిన దాఖలాలు లేవు. అమిత్‌షా, మోడీ ఎన్నో సార్లు రాష్ట్రానికి వచ్చారు. ఒక్కసారైనా భద్రాచలం వచ్చారా? అనే ప్రశ్నలు స్థానిక రామభక్తులు లేవనెత్తుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుధవారం నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు ఇప్పటికే విచ్చేశారు.

భద్రాచలం రాజకీయంగా ఉపయోగపడదనే..
- మిడియం బాబూరావు, మాజీ ఎంపి, ఆదివాసీ నాయకులు

భద్రాచలం రాజకీయంగా ఉపయోగపడదనే బిజెపి నిర్లక్ష్యం చేస్తోంది. అయోధ్య ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. కేంద్రం భద్రాచలాన్ని పర్యాటక క్షేత్రంగా లేదా హెరిటేజ్ పట్టణంగా నిధులు ఇవ్వవచ్చు. రావణుడు ఏలిన శ్రీలంకలో రామాయణ సర్క్యూట్ పెట్టి పర్యాటకులను ఆకర్షిస్తుంటే భద్రాచలాన్ని ఎందుకు టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయకూడదో ఆలోచించాలి. కేంద్రానికి ఆదివాసీలు, ఆదివాసీ సంస్కృతులు అక్కర్లేదు. వాళ్లు నిజంగా రామభక్తులు కాదు.. రాజకీయం కోసమే రామున్ని వాడుకుంటున్నారు. రూ.900 కోట్లు వెచ్చించి అయోధ్య రామాలయాన్ని నిర్మించిన కేంద్రం రూ.వంద కోట్లు పెట్టి భద్రాచలాన్ని అభివృద్ధి చేయలేదా..

ఎన్నికల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎండి జహంగీర్

సిపిఎంను గెలిపిస్తే ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి

- మత విద్వేషాన్ని రెచ్చగొడుతున్న బిజెపిని ఓడించాలి : ఎండి జహంగీర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఎంను గెలిపిస్తే నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేస్తామని ఆ పార్టీ భువనగిరి ఎంపి అభ్యర్థి ఎండి జహంగీర్ తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గున్‌గల్ ఎస్సార్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ ఎన్నికల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో శివన్నగూడ లిఫ్ట్ ఇరిగేషన్ 25 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని అన్నారు. నల్లగొండ జిల్లాలోని నార్కట్‌పల్లి, చిట్యాల, కట్టంగూర్, తదితర మండలాలకు సాగు నీరు ఎంత ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పదవులను పాలకవర్గాలు ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించకుండా తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుతున్నారని ఆరోపించారు. గతంలో ఎంపిగా పనిచేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ ప్రాంతాన్ని ఎంతవరకు అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి సంక్షేమాన్ని విస్మరించారని తెలిపారు. అందుకే దేశంలో బిజెపిని గద్దె దించాలని పిలుపునిచ్చారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య, డి.జగదీష్, మండల కార్యదర్శి అలంపల్లి నరసింహ, మండల కమిటీ సభ్యులు పి.అంజయ్య, పెండ్యాల బ్రహ్మయ్య, చందునాయక్, ఏ.జంగయ్య, అమీర్‌పేట మల్లేష్, తావునాయక్, ఎంజే వినోద్‌కుమార్, పిరాటి వెంకటయ్య, ఉడుతల జంగయ్య, శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- చిన్న వ్యాపారుల షాపుల దగ్ధం
- రూ.మూడు లక్షల వరకు నష్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగి పండ్ల షాపు, టైర్ల కొట్టు, కొలిమి షాపు పూర్తిగా దగ్ధమైన ఘటన ఖమ్మం జిల్లా కల్లూరు పట్టణంలోని మెయిన్ రోడ్‌లో మంగళవారం తెల్లవారు జామున జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. సోమవారం రాత్రి తాళం వేసిన షాపుల్లో.. మంగళవారం తెల్లవారుజామున మంటలు చెలరేగడంతో స్థానికులు మేల్కొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినా మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. కాగా, అగ్నిప్రమాదం జరిగిన పండ్ల షాప్‌లో సుమారు రూ. లక్ష విలువ చేసే వివిధ రకాల పండ్లు దగ్ధం కాగా, రూ.40 వేల నగదు కూడా దగ్ధమైనట్టు యజమాని షేక్ నషీర పాషా తెలిపారు. టైర్ల కొట్టులో గాలి మిషన్, టైర్లు దగ్ధం కావడంతో సుమారు లక్ష రూపాయలు వరకు నష్టం జరిగిందని యజమాని ఆకుల ప్రసాద్ వాపోయాడు. కొలిమి షాపులో రూ.50 వేల వరకు నష్టం జరిగిందని యజమాని తెలిపారు. అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ హుటా హుటిన సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రమాదం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్ట రాగమయితో ఫోన్‌లో మాట్లాడి బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సంఘటనా స్థలంలో ఆస్తి నష్టాన్ని అంచనా వేసి నివేదిక సమర్పించాలని ఆర్ఐలు అన్వర్ పాషా, స్టాలిన్‌కు ఎమ్మెల్యే ఆదేశించినట్టు తెలిపారు.

మహబూబ్‌నగర్‌కు ఏథర్ ఎనర్జీ విస్తరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

భారతదేశంలోని ప్రముఖ ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీదారులలో ఒకటైన ఏథర్ ఎనర్జీ మహబూబ్‌నగర్‌లో ఏథర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ అవుట్‌లెట్‌లో తమ విక్రయాలు ప్రారంభమయ్యాని పేర్కొంది. దీన్ని వీటీ ఆటోమోటివ్స్ ప్రయివేట్ లిమిటెడ్‌తో కలిసి ఏర్పాటు చేసినట్లు తెలిపింది. దీంతో తెలంగాణలో 11 రిటైల్ అవుట్‌లెట్‌లు, 70 ఫాస్ట్ ఛార్జింగ్ గ్రిడ్‌లకు విస్తరించినట్లయ్యిందని వెల్లడించింది.

కంటికి రెప్ప కాదు.. కంట్లో నలుసు

- 'కడియం'పై మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన వాడే కంట్లో నలుసుగా మారాడని, తనకు కాకుండా పక్కన వారికి మర్యాద దక్కితే ఓర్వకుండా, పగ పెంచుకొని అనేక రకాలుగా బాధపెట్టే వాడని కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ధ్వజమెత్తారు. వరంగల్ పార్లమెంటు బిఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ గెలుపు కోసం జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్‌లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడియంపై రాజయ్య తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. బెదిరించడం, భయభ్రాంతులకు గురి చేయడంలో కడియం శ్రీహరిని మించిన వారు లేరని ఆరోపించారు. ఎంపి, ఉపముఖ్యమంత్రి, రెండుసార్లు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవి కూడా లాక్కున్నారని అన్నారు. కడియంను మేధావి అనుకునేవారికి చెంపలేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. 1994 నుంచి 2004 వరకు నియోజకవర్గంలో ఓ గ్రామ సర్పంచ్ జన్మభూమికి సహకరించపోతే జాఫర్ ఘడ్ గుట్టల్లో కొట్టించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 1999లో ఖల్ నాయక్ అని కడియంపై పుస్తకం వచ్చిందని, 1994లో టీచర్స్ కాలనీలో ఉన్న కడియం ఇల్లు చూస్తే.. గచ్చు నేల, కిటికీలకు గోనె సంచులు, తెగిపోయిన చెప్పులతో, మాసిన గడ్డం వేసుకొని పేకాట ఆడుతూ పట్టుబడి పోలీస్ స్టేషన్‌లో కూర్చున్న చరిత్ర కడియం శ్రీహరిదని అన్నారు. కడియం ఒక్కసారైనా మాదిగ, బైండ్ల గురించి మాట్లాడారా? అలా మాట్లాడారని నిరూపిస్తే తాను ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండనని సవాల్ విసిరారు. దళిత ద్రోహిగా, ఆనాడే దళిత దొరగా కడియంను పిలిచేవారని గుర్తుచేశారు. దేవనూరులో భూములు, ఆర్మీచర్ ప్లాంట్, పెట్రోల్ బంక్ ఎక్కడివని ప్రశ్నించారు. పార్టీకి, నియోజకవర్గానికి కడియం చేసిందేమీ లేదని, పైగా అవినీతిలో పూర్తిగా కూరుకుపోయారని తెలిపారు. ఇంతచేసిన తన బిడ్డకు కెసిఆర్ టికెట్ ఇచ్చారని, అయినా పార్టీ మారడానికి సిగ్గుండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో డైపర్ పెట్టుకుని తిరిగిన నువ్వు.. ఇప్పుడు ఏం పెట్టుకొని తిరుగుతావో చూస్తానని అన్నారు. అందరితో ఆత్మీయత పంచుకునేందుకు గడపగడపకు వస్తానని, బిఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌ను గెలిపించుకునే వరకు.. తగ్గేదేలేదంటూ సవాల్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు హాజరు కాకుంటే ఎఫ్ఐఆర్

- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఎన్నికల విధులకు హాజరుకాని సిబ్బందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. మంగళవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారులతో కలిసి మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 23,500 మంది సిబ్బందిని నియమించామని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి పిఒ, ఎపిఒలు 1700 మంది, మైక్రో అబ్జర్వర్లు 120 మంది, ఇతర పోలింగ్ సిబ్బంది రెండు వేల మంది శిక్షణకు హాజరు కాలేదన్నారు. వారిలో అనారోగ్యంతో బాధపడేవారు, గర్భిణులను మినహాయించి మిగిలిన వారికి రెండు సార్లు నోటీసులు ఇచ్చామన్నారు. త్వరలో వారిపై ఎఫ్ఐఆర్ బుక్ చేయడంతోపాటు ఇతర చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయని గుర్తుచేశారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రోనాల్డ్ రోస్

ట్రిపుల్ ఐటిలో విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీలో మరో విద్య కుసుమం నేలరాలింది. హాస్టల్ గదిలో విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. యూనివర్సిటీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..

సిద్దిపేట జిల్లా తోగుట మండలం బండారుపల్లికి చెందిన బుచ్చుక అరవింద్ ట్రిపుల్ ఐటీలో పియుసి రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో హాస్టల్ గదిలో ఉరేసుకున్నాడు. మంగళవారం ఉదయం గమనించిన తోటి విద్యార్థులు యూనివర్సిటీ అధికారులకు సమాచారం అందించడంతో సెక్యూరిటీ సిబ్బంది స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విద్యార్థి తల్లిదండ్రులకు యూనివర్సిటీ అధికారులు సమాచారం అందించారు. ఈ నెల 18 నుంచి పియుసి రెండో సంవత్సరం విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థి హాజరు 50 శాతం కన్నా తక్కువగా ఉందని అధికారులు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో ఒత్తిడికి గురై విద్యార్థి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని అనుమానిస్తున్నారు. విద్యార్థి మృతిపై యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ వెంకటరమణ సంతాపం వ్యక్తం చేశారు.

బిజెపి గెలిస్తే రిజర్వేషన్లు ఉండవు

- ఇప్పటికే ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మింది
- రాష్ట్ర సర్కారును కూలగొట్టే కర్మ మాకు లేదు
- ఆదిలాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగరేయాలి : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బిజెపి ఎంపిలు, ఇతర కీలక నాయకులు తాము మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు తొలగిస్తామని చెబుతున్నారు. బిజెపి ఇప్పటికే ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మింది. దీన్ని బట్టి బిజెపి మరోసారి గెలిస్తే దేశంలో రిజర్వేషన్లు అనేవి ఉండకుండా పోతాయి" అని బిఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో కెటిఆర్ ప్రసంగించారు. బిజెపి నేత బండి సంజయ్ మోడీ దేవుడని చెబుతున్నారు... ఆయన్ను దేవుడు అని ఎందుకు అనాలి..? అని ప్రశ్నించారు. ఆదిలాబాద్‌లో సిసిఐ పరిశ్రమను పునరుద్ధరించలేదని, ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం చేపట్టడం లేదని, బయ్యారం ఉక్కు కర్మాగారం ఇవ్వలేదని ఇలాంటి బిజెపికి ఎందుకు ఓటేయాలని అన్నారు. 2026లో నియోజకవర్గాల పునర్విభజన జరుగుతాయని, జనాభా ప్రాతిపదికన చేపట్టే ఈ విభజన కారణంగా రాష్ట్రంలో పార్లమెంటు నియోజకవర్గాలు తగ్గే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

లోక్‌సభ ఎన్నికలు ముగియగానే రాష్ట్రంలో పెను మార్పులు చోటుచేసుకుంటాయని చెప్పారు. సిఎం రేవంత్‌రెడ్డి బిజెపిలో చేరుతారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసినా బిజెపికి వేసినట్లేననే విషయం గుర్తించుకోవాలని సూచించారు. సిఎం జేబులో కత్తి పెట్టుకొని తిరుగుతున్నానని.. పేగులు మెడలో వేసుకుంటానని, మానవ బాంబులుగా మారుతామని అంటున్నారని, సిఎం లాంటి వ్యక్తులు మాట్లాడే భాషేనా ఇది అని ప్రశ్నించారు. రాష్ట్ర సర్కారును కూలగొట్టే కర్మ మాకు పట్టలేదని, రాబోయే ఐదేళు నడపండి.. 420 హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కటెఇఆర్

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరాలంటే.. బీఆర్ఎస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. పదేండ్లలో చేసిన అభివృద్ధి పనులను మనం చెప్పుకోలేకనే ఓటమి చెందామని గుర్తుచేశారు. 2లక్షల ఉద్యోగాలు కల్పించామని.. ఉద్యోగులకు రెండు సార్లు పీఆర్సీ అమలు చేశామని.. ఆర్థిక సంక్షోభం కారణంగా జీతం సరిగా వేయలేకనే ఉద్యోగుల అసంతృప్తికి కారణమైందని తెలిపారు. ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ తాము వేస్తే.. 32 వేల ఉద్యోగాలు ఇచ్చామని రేవంత్‌రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్, బిజెపి పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని.. బీఆర్ఎస్ శ్రేణులు గట్టిగా పోరాడి లోక్‌సభ సీట్లలో విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ పార్లమెంటు స్థానంలో ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు.

ఇటీవల బిజెపిలో చేరిన ఆదిలాబాద్ జడ్పీ చైర్మెన్ జనార్దన్‌రాథోడ్ తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. కెటిఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నిర్మల్ జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ, నాయకులు జాన్సన్ నాయక్, రమాదేవీ, లోలం శ్యాంసుందర్, కిరణ్ కొమ్రెవార్, యూనిస్ అక్బానీ, అలాల్ అజయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే
మహిళా సంక్షేమానికి పెద్ద పీట

- అవినీతికి పాల్పడినట్టు రుజువులు ఉంటే చూపించాలి
- చేవెళ్ల కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపి అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్దషాపూర్ గ్రామంలోని ఎస్‌విఆర్ గార్డెన్లో నిర్వహించిన మహిళా సదస్సులో ఎంపి అభ్యర్థి రంజిత్‌రెడ్డి మాట్లాడారు. తాను అవినీతి పాల్పడినట్టు రుజువులు ఉంటే చూపించాలని ప్రతిపక్ష నాయకులకు సవాల్ విసిరారు.

రాముని పేరు చెప్పి బిజెపి రాజకీయలు చేస్తోందని ఆరోపించారు. బిజెపి ఎంపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఎవరైనా కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని, కానీ తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. కాంగ్రెస్ మాత్రమే మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తుందని అన్నారు. మహిళ విద్యావంతురాలు అయితే సమాజంలో వెలుగు వస్తుందని, కుటుంబం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఆరు గ్యారంటీల అమలుకు చర్యలు తీసుకుంటుందని అన్నారు.

బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండ, కొత్వాల్ గూడ, ఘాన్సీమియాగూడ గ్రామాల రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. తనను ప్రజలు ఆశీర్వదించి చేవెళ్ల ఎంపిగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధితోపాటు స్వచ్ఛంద కార్యక్రమాలూ చేయనున్నట్టు చెప్పారు.

మహిళా సదస్సులో అభివాదం చేస్తున్న ఎంపి అభ్యర్థి రంజిత్‌రెడ్డి

ఎన్నికల తర్వాత సంక్షేమ పథకాలు అమలు : టిటిడి బోర్డు సభ్యులు గడ్డం గీత

ఎన్నికల కోడ్ కారణంగా అమలుకు నోచుకోని ఆరు గ్యారంటీలలో మిగతా పథకాలు అన్నింటిని ఎన్నికల తర్వాత తప్పకుండా అమలు చేస్తామని టిటిడి బోర్డు సభ్యులు గడ్డం గీత అన్నారు. కాంగ్రెస్ ద్వారానే మహిళా సాధికారత సాధ్యమని తెలిపారు. నారి న్యాయ్ పేరుతో దేశవ్యాప్తంగా ఐదు అద్భుత గ్యారంటీలను కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ప్రకటించిందన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి చేతి గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న పాటలతో సభా ప్రాంగణం మార్మోగిపోయింది. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కస్తూరి నరేందర్, మాజీ ఎంపిపి చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు కోటేశ్వర్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఆనంద్, పెద్ద షాపూర్ మాజీ సర్పంచ్‌లు కామోని భాయి లక్ష్మయ్య, చెక్కల చంద్రశేఖర్, యాటకారి సిద్దేశ్వర్, హస్లీ రాములు, జిల్లా మహిళా అధ్యక్షులు మైలారం సులోచన, కవ్వగూడ ఎంపిటిసి సంగీత సిద్దేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.